# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ రైతులు, మత్స్యకారులు పాడిరైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

❖ ప్రతిపక్షాల నిరసనల మధ్య పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

❖ చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు.

❖ ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ని కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు విడుదల చేసింది.

❖ కోస్టల్ షిప్పింగ్ బిల్లు 2025ను రాజ్యసభ ఈరోజు ఆమోదించింది.

======================

రైతులు, మత్స్యకారులు పాడిరైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యవసాయంపై ఖర్చును తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. భారతదేశ వ్యవసాయ రంగానికి దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ చేసిన కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దేశ ఆహార భద్రతను తన జీవిత లక్ష్యంగా చేసుకుని పనిచేశారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

బీహార్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణల అంశంపై ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఉదయం 11 గంటలకు సమావేశమైనప్పుడు, స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని నిర్వహించడానికి ప్రయత్నించారు. ఓటర్ల జాబితా సవరణల అంశం పై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభను పలు మార్లు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు ప్రతిపక్షాలు స్పీకర్ సమీపంలోకి వెళ్లి నినాదాలు చేశారు. గందరగోళ వాతావరణం మధ్యలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెట్టిన మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు 2025, మణిపూర్ కేటాయింపు బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. అనంతరం సభకు రేపటికి వాయిదా వేస్తున్నట్లుగా స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలోనూ ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ వివిధ అంశాలకు సంబంధించి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో సంత్ కబీర్ చేనేత అవార్డులు, జాతీయ చేనేత అవార్డులు 2025ను కేంద్రమంత్రి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా భారత చేనేత ఉత్పత్తులు ప్రాచుర్యం... పొందాలని ఆకాంక్షించారు. దేశంలోని చేనేత కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గిరిరాజ్ సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

ఈ కార్యక్రమంలో కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరీటా మాట్లాడుతూ... చేనేత పరిశ్రమకు ఈ-కామర్స్ ఇంటిగ్రేషన్ విస్తృత మార్కెట్‌ను అందిస్తోందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ని కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు జారీ చేసింది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీగా ప్రకటించింది. 22న నామినేషన్ల పరిశీలన, 25న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. సెప్టెంబర్ 9న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. గత నెలలో జగదీప్ ధన్‌ఖర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ ఎన్నిక అనివార్యమైంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నికలో ఎన్నికైన ఎంపీలతో పాటు నామినేటెడ్ ఎంపీలు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు పద్ధతి ద్వారా ఈ ఎన్నికను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

కోస్టల్ షిప్పింగ్ బిల్లు 2025ను రాజ్యసభ ఈరోజు ఆమోదించింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. తీర ప్రాంతంలో ఓడల కదలికలపై నియంత్రణకు సంబంధించిన చట్టాన్ని ఏకీకృతం చేయడం, సవరించడం ఈ బిల్లు లక్ష్యం. అలాగే తీరప్రాంత వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, దేశీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఆస్కారం ఉంటుంది. లైసెన్స్ లేకుండా పని చేయడం, షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ ఆదేశాలను ఉల్లంఘించడం, తప్పుడు సమాచారం అందించడం వంటి కొన్ని నేరాలకు శిక్షగా ఓడలను నిర్బంధించడానికి కూడా ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చకు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానమిస్తూ.. 2030 నాటికి దేశ తీరప్రాంత కార్గో ట్రాఫిక్ లక్ష్యాన్ని 230 మిలియన్ మెట్రిక్

టన్నులకు చేరుకోవడంలో ఇది సహాయపడుతుందన్నారు. తీరప్రాంత వాణిజ్యాన్ని మరింత సులభతరం చేయడానికి కోస్టల్ షిప్పింగ్ బిల్లు రూపొందించబడిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళా నాయకత్వం కీలక భూమిక పోషిస్తోందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణ దేవి పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఐక్యరాజ్యసమితి మహిళా ప్రధాన సామర్థ్య నిర్మాణ కార్యక్రమం షీలీడ్స్ రెండవ సంచికను ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... షీలీడ్స్ వంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు అవసరమైన నైపుణ్యాలతో పాటు సరైన భవిష్యత్‌కు దిశా నిర్దేశం చేసేవిగా ఈ కార్యక్రమాలు ఉంటున్నాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈరోజు మాస్కోలో రష్యా భద్రతా మండలి అధిపతి సెర్గీ షోయిగును కలిశారు. రష్యాతో భారతదేశానికి ప్రత్యేకమైన దీర్ఘకాల సంబంధం ఉందని ఈ సందర్భంగా అజిత్ దోవల్ చెప్పారు. ఇరు వైపులా ఉన్నత స్థాయి సంబంధాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ సంబంధాలు చాలా వరకు పరస్పర అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు. ఇదిలా ఉండగా, రష్యా అధ్యక్షులు వ్లాదమిర్ పుతిన్ భారత్ పర్యటన ఖరారైందని అజిత్ దోవల్ వెల్లడించారు. పుతిన్ పర్యటన తేదీలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నోట్ల కట్టల కేసులో విచారణ కమిటీ నివేదికను సవాలు చేస్తూ.. జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ఈరోజు కొట్టివేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, ఎ.జి. మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం, జస్టిస్ వర్మ పిటిషన్ పై ఈ మేరకు. తీర్పు వెలువరించింది. ఈ సంవత్సరం మార్చిలో ఢిల్లీలోని జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో పెద్ద మొత్తంలో పాక్షికంగా కాలిపోయిన నోట్ల కట్టలు లభించాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులతో అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సుదీర్ఘ విచారణ అనంతరం తన నివేదికను సమర్పించింది. జస్టిస్ వర్మ విచారణ నివేదికను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ విచారణ కమిటీ నివేదికను సమర్థించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ ఈ రోజు విడుదల చేసిన నేపథ్యంలో న్యూఢిల్లీలో పార్లమెంట్ ఛాంబర్‌లోని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా కార్యాలయంలో... ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన కీలక నేతలు సమావేశమయ్యారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే నిర్ణయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు అప్పగిస్తూ.. ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 8వ తేదీన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు మరోసారి సమావేశం కావాలని నిర్ణయించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజులలో అరుణాచల్ ప్రదేశ్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అదే విధంగా హిమాచల్ ప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ..

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =